# పోలీసు అమరవీరులకు ఘననివాళి






అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్, నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

- ఉమ్మడి జిల్లాలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- నివాళులర్పించిన కలెక్టర్లు, సీపీ, ఎస్పీ, అధికారులు

నిజామాబాద్ క్రైం/ కామారెడ్డి, అక్టోబర్ 21 : నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్, నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ, అధికారులు అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

**పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం**
**- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోలీసు అమరవీరులకు నివాళులర్పించి మాట్లాడారు. ఏ ప్రాంతంలోనైతే శాంతి భద్రతలు నెలకొని ఉంటాయో, ఆ ప్రాంతం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకే పరిమితం కాకుండా, ఎలాంటి విపత్తు సంభవించినా ముందు స్పందించేది పోలీసులేనని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉందని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకొని అతి తక్కువ సమయంలో పోలీసులు కేసులను ఛేదిస్తున్నారని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదన్నారు. ఈ సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా 189 మంది పోలీస్‌సిబ్బంది తమ ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో 1986వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు 19 మంది పోలీసు అధికారులు అమరవీరులయ్యారని తెలిపారు.

**శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసుల కృషి**
**- సీపీ కల్మేశ్వర్**

దేశం, రాష్ట్రం కోసం విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషిచేస్తున్నారని సీపీ కల్మేశ్వర్ అన్నారు. 1959 అక్టోబర్ 21న విధి నిర్వహణలో ఉన్న పది మంది సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారని గుర్తుచేశారు. అక్సాయిచిన్ వద్ద చైనా ఎదురుదాడిలో అసువులు బాసిన వీర జవాన్ల జ్ఞాపకార్థం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకొంటున్నట్లు తెలిపారు. అమరులను స్మరిస్తూ జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు పట్టాలు, గిఫ్ట్ ప్యాక్‌లను కలెక్టర్, సీపీ అందజేశారు. కార్యక్రమంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసులు జయరాం, గిరిరాజు, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, సైబర్‌క్రైం, సీసీఆర్‌బీ ఏసీపీలు కిరణ్ కుమార్, నారాయణ, రాజశేఖర్ రాజ్, వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎస్‌బీఐ శ్రీశైలం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్‌ఐలు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పోలీసుల పాత్ర మరువలేనిది**
**- కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి జిల్లాకేంద్రంలోని పోలీసు కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పోలీసు అమరవీరులకు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పర్యవేక్షణలో నిరంతరం శ్రమిస్తూ, ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసుల పాత్ర మరువలేనిదని అన్నారు. కామారెడ్డి జిల్లా నుంచి ఏడుగురు పోలీసు అధికారులు విధి నిర్వహణలో అమరులయ్యారని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలను స్మరించుకుందాం

- ఏడో బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్



బెటాలియన్‌లో అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ రాంప్రకాశ్

డిచ్‌పల్లి, అక్టోబర్ 21 : మండలకేంద్రంలోని ప్రత్యేక రాష్ట్ర ప్రత్యేక ఏడో బెటాలియన్‌లో కమాండెంట్ రాంప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలను ఉంచి నివాళులర్పించారు. 7వ బెటాలియన్‌కు చెందిన 11 మంది పోలీసు సిబ్బంది ఆత్మలకు శాంతి చేకూరాలని కోరారు. బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని కమాండెంట్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి, భాస్కర్‌రావు, ఆంజనేయరెడ్డి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ అనుపమ, ఏవో హంసరాణి, ఆర్‌ఐలు వెంకటేశ్వర్లు, నరేశ్, శ్యామ్‌రావు, ప్రహ్లాద్, ఆర్‌ఎస్సైలు, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



**దేవీ నవరాత్రోత్సవాల్లో** భాగంగా బీఆర్‌ఎస్ నాయకుడు పబ్బ సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో భవానీ ర్యాలీని శనివారం సాయంత్రం నిర్వహించారు. పోచమ్మగల్లీలో ర్యాలీని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ప్రారంభించారు. ర్యాలీలో మాలధారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– ఖలీల్‌వాడి, అక్టోబర్ 21

## ఫిర్యాదులపై త్వరగా స్పందించాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్**




వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

నిజామాబాద్ స్పోర్ట్స్ / కామారెడ్డి, అక్టోబర్ 21 : ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులపై త్వరగా స్పందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ యాదవ్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా లిఖిత పూర్వక సమాధానం అందించాలని సూచించారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి సువిధ యాప్ ద్వారా, ఆఫ్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను స్వీకరించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలన్నారు. తనిఖీల్లో భాగంగా సీజ్ చేసిన బంగారం, నగదు రూ.10 లక్షల కన్నా తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించాలని ఆదేశించారు. రూ.10 లక్షల కన్నా ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని సూచించారు. ప్రతి తనిఖీని వీడియో రికార్డు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు నిజామాబాద్ నుంచి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగర పాలక కమిషనర్ మకరంద్, జిల్లా అధికారులు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు హాజరయ్యారు.

కామారెడ్డి నుంచి ఎస్పీ సింధూశర్మ, నోడల్ అధికారులు సాయన్న, కిషన్, శ్రీనివాస్, బావయ్య, శ్రీధర్ రెడ్డి, సురేందర్ కుమార్, సతీశ్‌యాదవ్, శాంతి కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయిభుజంగరావు హాజరయ్యారు.

# బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతుల వెల్లువ

**మంత్రి వేముల, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు పలు సంఘాల మద్దతు**



మంత్రి వేములకు మద్దతు తెలుపుతూ తీర్మాన ప్రతులను డాక్టర్ మధుశేఖర్‌కు అందజేస్తున్న పల్లికొండ మాదిగ యువజన సంఘం సభ్యులు



ఆర్టీఏ సభ్యుడు రేగుల రాములుకు తీర్మాన ప్రతిని అందజేస్తున్న రామన్నపేట్ గ్రామ కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు



రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్‌కు తీర్మాన ప్రతిని అందజేస్తున్న నల్లవెల్లి యాదవ సంఘ సభ్యులు

భీమ్‌గల్/ వేల్పూర్, అక్టోబర్ 21 : వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతులు వెల్లువెత్తుతున్నాయి. శనివారం వివిధ మండలాలకు చెందిన పలు సంఘాలు, కులస్తులు తీర్మానాలు చేసి పత్రాలను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులకు అందజేశారు.

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి భీమ్‌గల్ మండలంలోని పల్లికొండకు చెందిన మాదిగ యువజన సంఘం, మాల సంఘం సభ్యులు తమ మద్దతు తెలుపుతామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన ప్రతులను తెలంగాణ ఫ్యామిలీ అండ్ హెల్త్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దళితుల సంక్షేమం కోసం కృషిచేస్తున్నారని, తమ కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు కన్నె సురేందర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేల్పూర్ మండలం మండలంలోని రామన్నపేట్ గ్రామంలోని కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు శనివారం సమావేశమయ్యారు. ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి తమ మద్దతు అందజేయాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీని ఆర్టీఏ సభ్యుడు రేగుల రాములుకు అందజేశారు.

**రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు..**

ఇందల్వాయి, అక్టోబర్ 21 : మండలంలోని నల్లవెల్లికి చెందిన యాదవ సంఘ సభ్యులు బీఆర్‌ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతు తెలుపుతూ శనివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, సర్పంచ్ నోముల విజయలక్ష్మి, వైస్ చైర్మన్ అంజయ్యకు అందజేశారు.

నల్లవెల్లి గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘ సభ్యులందరూ బాజిరెడ్డి గోవర్ధన్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీని నాయకులకు అందజేశారు.